క్లుప్తంగా

మహ్మద్‌నగర్‌లో ఆరోగ్య మేళా



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్ నగర్‌లో టీబీ ఇతర వ్యాధులపై మంగళవారం వైద్యసిబ్బంది ఆరోగ్యమేళా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఏఎన్‌ఎంలు రాజమణి, మజీదాబేగం గ్రామస్తులకు బీపీ, షుగర్, టీబీ ఇతర వ్యాధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, రెండు వారాలకంటే ఎక్కువగా దగ్గు ఉన్నట్లయితే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నివారణకు ప్రభుత్వం ఉచితంగా చికిత్సలు చేసి మందులు పంపిణీ చేస్తుందన్నారు.

వడ్డీ మాఫీ పత్రాల పంపిణీ



రుణమాఫీ పత్రాలతో మహిళలు

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వం మహిళల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని సర్పంచ్ మాధవరెడ్డి అన్నారు. మండలంలోని పోతారం గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం గ్రామ మహిళా సమాఖ్య సభ్యులకు ప్రభుత్వం అందించే వడ్డీ మాఫీ రుణాల పత్రాలను అందజేశారు. ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కోసం రుణాలను సైతం అందజేస్తుందన్నారు. గ్రామంలో 17 మహిళా గ్రూపులకు రూ.2,98,836 విలువ గల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో సమస్యలు పరిష్కరించండి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వినోద్‌నాయక్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి ఎస్టీ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని గిరిజన జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వినోద్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం అందించాలన్నారు. గదుల్లో లైట్లు, ఫ్యాన్లు సరిగాలేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

'ధరణి' సమస్యలను పరిష్కరించండి

నర్సాపూర్: ధరణిలో నెలకొన్న సమస్యల కారణంగా రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు ఆరోపించారు. భూములు రిజిస్ట్రేషన్ చేయించి మూడు నెలలు గడుస్తున్నా రైతులకు పట్టాదార్ పాసుపుస్తకాలు అందడం లేదని అన్నారు. పాస్ పుస్తకాలు రానందున రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొందలేకపోతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పాస్‌బుక్‌లను అందించాలని కోరారు.

మాత్రలతో టీబీ నివారణ సాధ్యం



అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎం తిరుపతమ్మ

వర్గల్(గజ్వేల్): క్రమబద్ధంగా మాత్రలు వేసుకోవడం ద్వారా టీబీ వ్యాధి నివారించుకోవచ్చని ఏఎన్‌ఎం తిరుపతమ్మ తెలిపారు. మంగళవారం వర్గల్‌లోని పలు కాలనీల్లో మహిళలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, దగ్గినప్పుడు రక్తం పడడం టీబీ లక్షణాలుగా పేర్కొన్నారు. ఇలాంటి లక్షణాలు కనపడితే ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా తెమడ పరీక్ష జరిపించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ జరిగితే 6 నుంచి 8 నెలలు మాత్రలు వేసుకోవాలని వివరించారు. ఇవి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా ఇస్తారన్నారు.

అధికారుల తీరు.. అందని నీరు



అల్లాదుర్గం శివారులో అసంపూర్తిగా సంపు (ఇన్‌సెట్‌లో ముస్లాపూర్ గ్రామానికి నీరందించే సంపు)

అల్లాదుర్గం(మెదక్): ఇంటింటికీ తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో అమలుకావడంలేదు. అధికారులు మధ్య సమన్వయం కొరవడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నీటిని అందించేందుకు గ్రామాల్లో నిర్మించిన వాటర్ ట్యాంకులు, సంపులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవంతో వెంకట్‌రావ్‌పేట గ్రామస్తులు ఐదేళ్లగా భగీరథ నీటికి నోచుకోవడంలేదు.

అసంపూర్తిగా పనులు..

భగీరథ పథకంలో భాగంగా రూ.12లక్షలతో చేపట్టిన ఈ పనులు అస్తవ్యస్తంగా మారాయి. సంపు నిర్మించి, విద్యుత్ కనెక్షన్, మోటార్ ఏర్పాటు చేసి ట్యాంకులకు నీరు అందించాల్సి ఉంది. అల్లాదుర్గం శివారు కాలువ కల్వర్టులో సంపు నిర్మించి, విద్యుత్ కనెక్షన్ మరిచారు. సంపు పైన జాలి వేయకుండా వదిలేయడంతో రెండు నెలలుగా వృథాగా మారింది. ముస్లాపూర్ గ్రామానికి చెందిన సంపును గడిపెద్దాపూర్ గ్రామం వద్ద నిర్మించి, అక్కడి నుంచి నీటిని అందిస్తున్నారు. ఇక్కడి మోటార్‌ను భగీరథ అధికారులు తీసుకువెళ్లారని సర్పంచ్ మల్లేశం తెలిపారు. ఈ విషయంపై భగీరథ ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా.. మోటార్లు చెడిపోవడంతో బాగు చేసేందుకు తరలించినట్లు తెలిపారు. సంపునకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ ఏడీకి లెటర్ అందించారు. కనెక్షన్ రాగానే నీటిని అందిస్తాం.

పట్టించుకోవడం లేదు

వెంకట్‌రావ్‌పేట గ్రామంలో ఉన్న సుమారు 200 గృహాలకు భగీరథ నీరు అందడంలేదు. దీంతో అందక బోరు నీరే తాగాల్సి వస్తోంది. ట్యాంక్, సంపు నిర్మించినా.. నీటిని అందించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

– బాలమణి, సర్పంచ్, వెంకట్రావ్‌పేట

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్

నర్సాపూర్: పట్టణంలో కుక్కలు, కోతుల సంచారం పెరిగిందని, ప్రజలు వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కుక్క కాటు నివారణపై అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ మాట్లాడుతూ చిన్న పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపవద్దని, వీధి కుక్కలు గుంపులుగా ఉన్న చోటకు పిల్లలు వెళ్లకుండా చూడాలన్నారు. ఒక వేళ బయటకు వెళితే వారిని ఓ కంట గమనించాలని కోరారు. పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ జనార్దన్ రావు మాట్లాడుతూ వాసన చూసే కుక్కలు కరవని, కుక్కలను చూసి పరుగు పెట్టొద్దని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ మార్టిన్‌లూథర్, ఎంఈఓ బుచ్యానాయక్, కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, బుచ్చేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి గంగుమల్లు

తూప్రాన్: వరి పంటలో వచ్చే కాండం తొలచు పురుగు, అగ్గి తెగులు, పాము పొడ తెగులు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి గంగుమల్లు అన్నారు. పట్టణంలోని రావెల్లి గ్రామంలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. మొక్కలో రోగ నిరోధక శక్తిని పెంచడానికి పొటాష్ (ఎంఓపీ)ఎరువును ఎకరాకు 15–20 కిలోలు వేయాలన్నారు. పాముపొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 5% ఈసీ మందును 2 మీ.లీ ఒక్క లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పురుగు నివారణకు కార్టాప్ హైడ్రో క్లో రైడ్ 50% ఎస్‌పీ మందును 2గ్రా ఒక లీటరు నీటికి కలిపి చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సంతోష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

కిష్టాపూర్ సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్ గోదావరిని సన్మానిస్తున్న మహిళలు

కొల్చారం(నర్సాపూర్): ఇటీవల భువనేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయస్థాయి పురస్కారం అందుకున్న మండలంలోని కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ గోదావరిని గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ గోదావరి అధ్యక్షతన నిర్వహించిన మహిళా దినోత్సవంలో గ్రామస్థాయిలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు వసంత, ఐకేపీ సీసీ కవిత, కార్యదర్శి మమత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వడ్డీ చెల్లింపు పత్రాల అందజేత



వడ్డీ చెల్లింపు పత్రాలను అందిస్తున్న సర్పంచ్ లక్ష్మణ్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం గ్రామంలో 31 మహిళా సంఘాలకు అందించిన రుణాలకు సంబంధించిన వడ్డీ డబ్బులు రూ.14,63,248 నిధులు ఖాతాల్లో జమైనట్లు సర్పంచ్ మంచాల లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని రుద్రారం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా సమాఖ్య సంఘాల సభ్యులకు వడ్డీ చెల్లింపు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వడ్డీ జమ కావడంపై మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని జగ్గంపేటలో డ్వాక్రా మహిళలకు మంగళవారం వడ్డీలేని రుణ ప్రొసీడింగ్‌లను మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, సర్పంచ్ మాంతప్ప, సీసీ నిర్మల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 28 మహిళా సంఘాలు ఉండగా 2019, 2020 ఏళ్లకు సంబంధించి రూ.11.32లక్షలు వడ్డీ మాఫీ రావడంతో డ్వాక్రా మహిళలకు ప్రొసీడింగ్స్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోచమ్మ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశుని కల్యాణం

పాపన్నపేట(మెదక్): మండలంలోని అబ్లాపూర్‌లో మంగళవారం వేంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ఆలయ వ్యవస్థాపకుడు నీరుడి లక్ష్మమ్మ, నారాయణ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, ఏడుపాయల ఆలయ చైర్మన్ బాలాగౌడ్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సోములు, గాంధారిపల్లి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



చిన్నశంకరంపేట: పోలీస్‌ల అదుపులో బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ జిల్లా కేంద్రంలో మంత్రి హరీశ్‌రావు పర్యటనను అడ్డుకుంటారనే అనుమానంతో బీజేపీ మండల నాయకులను పోలీస్‌లు మంగళవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పెగుల రాజు, పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజు, మేడి శ్రీను, బీజేవైఎం కోశాధికారి మధును పోలీస్‌లు అరెస్ట్ చేశారు.

నర్సాపూర్: బోధన్‌లో మంత్రి కేటీఆర్ సభ ఉన్న నేపథ్యంలో నర్సాపూర్‌కు చెందిన పలువురు బీజేవైఎం నాయకులను పోలీసులు మంగళవారం ముందుస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పట్టణ బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ప్రేంకుమార్‌తో పాటు పలువురు నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించి, మధ్యాహ్నం తర్వాత వదిలి పెట్టారు.

సద్వినియోగం చేసుకోవాలి



అజ్జమర్రిలో కంటి వెలుగు వైద్యశిబిరం

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వినోద రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అజ్జమర్రిలో శిబిరాన్ని ప్రారంభించారు. నేత్ర సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరశురాంరెడ్డి, డాక్టర్ శ్రీలక్ష్మీ, నాయకులు వీరస్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.

సమయానికంటే ముందే సెంటర్‌కు చేరుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటర్ విద్యార్థులు సమయానికంటే ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఎగ్జామ్ సూపరింటెండెంట్ నాగేందర్ కోరారు. ఉదయం 9నుంచి 12 గంటల వరకు జరిగే పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 117 మంది, మోడల్ స్కూల్‌లో 197 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): పేద కుటుంబాలకు పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన పెద్దిపల్లి లక్ష్మీ కొడుకు వివాహానికి రూ.10వేలు, గ్రామంలో ఇటీవల మృతిచెందిన కుల దుర్గమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇందిర, బీఆర్ఎస్ నాయకులు జగన్‌రెడ్డి, సత్యం, భూమాలింగం, సంతోష్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న వెంకట్రామిరెడ్డి

తెగుళ్లను సకాలంలో నివారించాలి



మాట్లాడుతున్న ఏడీఏ వసంత సుగుణ

రామాయంపేట(మెదక్): వరి, మొక్కజొన్న పంటలకు ఆశిస్తున్న తెగుళ్లను సకాలంలో నివారించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ) వసంత సుగుణ రైతులకు సూచించారు. మంగళవారం నార్సింగి మండలంలోని రైతువేదికలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వరిపంటలో అగ్గి తెగులు, తెల్ల కంకి, మొక్కజొన్నలో కత్తెరపురుగు వ్యాపించి పంటలు దెబ్బతింటాయన్నారు. రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి వారు సూచించిన మందులను వాడాలన్నారు. పలువురు రైతులు తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. సదస్సులో మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు ఎన్నం లింగారెడ్డి, మండల వ్యవసాయ అధికారి యాదగిరి, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భాషపై పట్టు సాధించేలా బోధన ఉండాలి



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతీఈ విద్యార్థి భాషపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని రాష్ట్ర విద్యాకమిటీ టీం సభ్యులు ప్రశాంత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కాళ్ళకల్, కోండాపూర్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశమై బోధన పద్ధతులపై చర్చించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యాబోధన పద్ధతులు, తదితర అంశాలపై విద్యాకమిటీ టీం సభ్యులు పర్యవేక్షణ చేస్తారని అన్నారు. వీరితో మనోహరాబాద్, కాళ్ళకల్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వెంకటస్వామి, సత్యం, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ శిరీష తదితరులున్నారు.

కుటుంబానికి అండగా ఉంటా



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాంబండ గ్రామంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాయిని వేణుగోపాల్‌రెడ్డి తల్లి నాయిని సునంద ప్రథమ వర్ధంతిలో పాల్గొని, ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయనతో నాయిని రామకృష్ణారెడ్డి, మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి హనుమంత్‌రావు, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, సర్పంచ్ శివులు, నాయకులు నర్సింహారెడ్డి, రాంమోహన్‌రెడ్డి, యాదగౌడ్, కృష్ణారావ్, శేఖర్‌గౌడ్, న ర్సింలుగౌడ్, బిక్షపతిరెడ్డి, వీరాస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, నవీన్ తదితరులు ఉన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో భక్తులు

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో రేణుకా మాత ఆలయంలో మంగళవారం నిర్వహించిన కలల్యాణోత్సవం కనులపండువగా సాగింది. గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాలల్గొని బోనాల ప్రదర్శన నిర్వహించారు. నూకలమర్రి రాజేశ్వర్‌గౌడ్ బృందం నిర్వహించిన ఒగ్గు కథ ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో నార్సింగి ఎంపీపీ చిందం సబిత, సర్పంచ్ అశోక్, సహకార సంఘం అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ పండరిగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాబు, నాయకులు మల్లేశంగౌడ్, తౌర్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.



కాళ్లకల్‌లో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్లకల్‌లో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్ళకల్‌లో రేణుకా ఎల్లమ్మ కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జెగ్గ ప్రభాకర్‌గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం, ప్రత్యేక పూజలు చేశారు. ఒగ్గు కళాకారులు, పోతరాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పురం నవనీత, సర్పంచ్ నత్తి మల్లేష్, ఎంపీటీసీ నత్తి లావణ్య , ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



కౌడిపల్లి: కంచన్‌పల్లిలో విద్యార్థులు, టీచర్లు



రేగోడ్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. కలెక్టర్‌గా ఆంజనేయులు, డీఈఓగా హర్షిత, ఎంఈఓగా క్రాంతికిరణ్, హెచ్‌ఎంగా భానుప్రియ, ఉపాధ్యాయులుగా క్రాంతి, రోహిత్, సహస్ర విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చంద్రకాంత్, ఉపాధ్యాయులు బాలశేఖర్, మమత పరిశీలించి బహుమతులు పంపిణీ చేశారు.

మినీ గురుకులంలో..

కౌడిపల్లి గిరిజన బాలికల మినీ గురుకులంలో నిర్వహించిన స్వయం పరిపాలనలో ప్రిన్సిపాల్ స్రవంతి, ఉపాధ్యాయులు శోభారాణి, మరోని, మాధవి, లలిత, వైష్ణవి, సరోజ, కవిత, శైలజ పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని చెట్లతిమ్మాయిపల్లి యూపీఎస్, చందాయిపేట ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను హెచ్‌ఎం అక్బర్‌పాష, ఊర్మిళ, రాజశేఖర్ పర్యవేక్షణ జరిపారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన స్వయం పాలనలో డీఈఓగా దీపిక, ఎంఈఓగా మణివర్ధన్ గౌడ్, నోడల్ అధికారిగా సింధు ప్రియా, ప్రధానోపాధ్యాయుడిగా కరుణాకర్, ఉపాధ్యాయులుగా ఉత్తర వ్యవహరించారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నాగేందర్ రెడ్డి, కిష్టయ్య, వాణి పర్యవేక్షించారు.

రేగోడ్(మెదక్): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన నిర్వహించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులుగా విజయ్, ప్రశాంత్, సింధుజ, వరలక్ష్మి, విరాట్ దీక్షిత్, మౌనిక, సుస్మిత, బలరాం, విజయానంద్, చందన, హర్షిణి, సాహితీ, సంగమేశ్వర్, మల్లికార్జున్, అవినాష్, సాత్విక్, నాగరాజు, సాయి చరిత, లక్ష్మిప్రసన్న ఉన్నారు. హెచ్‌ఎం అంజుబాబు, ఉపాధ్యాయులు అశోక్, స్వాతి, సందీప్ కుమార్, నవీన్ కుమార్, సుకన్య పాల్గొన్నారు.

తూప్రాన్: మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం పట్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓగా విష్ణు, ఎంపీడీఓగా రేష్మిక, తహసీల్దార్‌గా నందిని, ఎంఈఓగా చిద్విలాస్, డిప్యూటీ డీఈఓగా పురుషోత్తం, ప్రధానోపాధ్యాయుడిగా నిశాంత్, అటెండర్‌గా అఖిల్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ, అనురాధ పాల్గొన్నారు.



కొల్చారం: ఎనగండ్ల పాఠశాలలో..



చేగుంట: చందాయిపేటలో..



కిష్టాపూర్ పాఠశాలలో..